
ప్రజాశక్తి
బుధవారం 1 జనవరి 2025 5
పార్వతీపురం మన్యం



పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

పార్వతీపురం : స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ అర్జీలను ఇవ్వడానికి వచ్చే ప్రజలకు తాగునీటి, టీ ఇచ్చే ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తనతో పాటు ఇతర జిల్లా అధికారులు పిజిఆర్ఎస్‌కు వచ్చే ప్రజల సమస్యలను విని, పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ విషయమై జిల్లా, మండల అధికారులకు మార్గదర్శకాలు, సూచనలు ఇవ్వనున్నారు. అర్జీల పరిష్కారంపై పటిష్టమైన ఆడిట్, శాఖాధికారులు భాధ్యతపై చర్చించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కార దిశగా అంతా కృషి చేయాలని కోరినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ అర్జీలను ప్రతి రోజూ అందించవచ్చన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు నుండి నాలుగు గంటల మధ్య కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారులకు తమ అర్జీలను సమర్పించవచ్చని సూచించారు.

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..

- గ్రీటింగ్స్ పోయి సోషల్ మీడియా వచ్చే
- మంచి జరగాలనే కోరికలు
- అవరోధాలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిర్రున తిరిగే కాలచక్రంలో 2024వ సంవత్సరం చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. 2025వ సంవత్సరం కొన్ని గంటల మునుపు రానే వచ్చేసింది. గడిచిపోయిన సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ... 2025వ ఏటకు స్వాగతం పలుకుతూ జనం ఒకింత ఉత్సాహంతో కేరింతల నడుమ కేకులు కట్ చేస్తున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పరస్పర పలకరింపులు, వాట్సాప్ మెసేజీలు మంగళవారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. ఇదంతా షరా మామూలే. నూతన సంవత్సర వేడుకలు ఎప్పుడూ జరుగుతున్నవే. కానీ, నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ కొత్త ఆశలు మొలకెత్తాయి. అందుకు తగ్గట్టే ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

ఈ ఏడాది వ్యాపారంలో విస్తరించాలని, వృద్ధిచెందాలని కొందరు.. ఉపాధి, ఉద్యోగాలు సాధించాలని మరికొందరు.. ఉద్యోగోన్నతి, పదోన్నతులు చేపట్టాలని ఇంకొందరు.. తమ కష్టనష్టాలు తీరాలని ఇంకొందరు ఆకాంక్షించడం నూతన సంవత్సరం మొదలైనవేళ పరిపాటి. గడిచిన ఏడాదిలో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, మునుపెన్నడూ లేనంతగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు ఒకింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అక్టోబరులో నెలకున్న వర్షాభావంతో కొంతమంది, డిసెంబరులో వరి పంట చేతికందిన సమయంలో కురిసిన భారీ వర్షాలతో రైతులు కష్టనష్టాలను చవిచూశారు. ప్రభుత్వ విధానాలతో పలు రకాల వ్యాపారులు, వృత్తిదారులు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో కొత్త సంవత్సరంలోనైనా తమ సమస్యల పరిష్కారం కావాలని ఉద్యోగులు, ప్రకృతి కరుణించాలని, ఇప్పటికే జరిగిన నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ ఏడాదైనా రాజకీయ వేధింపులు, పొట్టకొట్టే చర్యలు తప్పాలని కోరుకుంటున్నారు.

ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాకపోయినప్పటికీ నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆశలు, ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలు మనసులో మెదలడం సహజమే. నూతన సంవత్సర మొదలు కాగానే ఏడాది పొడవునా తమ ఎదుగుదలకు, ఆలోచనలకు అటంకంగా మారుతున్న అలవాట్లను వదిలించుకోవాలని, సవాళ్లను ఎదుర్కోవాలని చాలా మంది భావిస్తారు. మరికొందరు కొంగొత్త ప్రణాళికలు రూపొందించుకుని, కార్యాచరణ కోసం కంకణ బద్ధులయ్యేందుకు సన్నద్ధమౌతారు. సాదాసీదాగా సాగి పోతున్న జీవితంలో నూతన సంవత్సరం కొత్త జోష్ నింపాలని కొందరు కోరుకుంటారు. ఈ మాటకొస్తే... కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామనే ఆలోచనలు ముఖ్యంగా కుర్రకారులో ఒకింత నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. వారం పది రోజుల ముందు నుంచే నూతన సంవత్సరంలో ప్రారంభించబోయే పనులు, లక్ష్యాల గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుంటారు. అయితే గతంతో పోలిస్తే నూతన సంవత్సర వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గ్రీటింగు, టెలిఫోన్ సమాచారాల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకునేవారు. అంతకు మునుపు వారం రోజుల ముందు నుంచే గ్రీటింగుల పంపే క్రమంలో పోస్టాఫీసులు కిటకిటలాడేవి. ఈ ఇప్పుడా పరిస్థితి లేదు. సప్తసముద్రాలు దాటివున్నవారు కూడా కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్ ద్వారా వీడియో కాన్ఫరెన్సులో కలుసుకునే పరిస్థితి కొన్నేళ్ల కిందటే వచ్చేసింది. ఇప్పుడు మరింతగా పెరిగింది. ఇక అతిథులను, పెద్దలను కలుసుకునే క్రమంలో పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు అందజేసుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. కేక్ కటింగ్ షరా మామూలే. ఈ క్రమంలో పండ్లు, స్వీటు దుకాణాలు, బేకరీలు, రంగులు విక్రయించే షాపులు సందడిగా కనిపించాయి. ముందస్తు ఆర్డర్లతో వ్యాపారులు బిజీబిజీగా మారారు.

ఇక మందుబాబుల హడావుడి కొన్నేళ్లగా హద్దులు దాటుతోంది. మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. పూటుగా తాగిన కుర్రకారు అర్ధరాత్రి దాటాక బైక్ రైడింగ్‌లతో వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఏదైనా ఈ హడావుడి ఈ ఒక్కరోజే. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జనం మనసుల్లో మెలిగే ఆశలు, ఆకాంక్షలు, కొత్తకొత్త ఆలోచనలు ఆచరణాత్మకం కావాలని, మంచి ఫలితాలను ఇవ్వాలని, ముఖ్యంగా పుట్టెడు సమస్యలతో సతమతమౌతున్న రైతులు, ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లు, చిరువ్యాపారుల కష్టాలు తీరాలని, అందరికీ మేలు జరగాలని, మంచి ఆరోగ్యం సిద్ధించాలని ఆకాంక్షిద్దాం.

జిల్లాను అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్లాలి

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



ఆశావాహ జిల్లాగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కొత్త సంవత్సరంలో ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపడతాం. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

కొత్త వెలుగులు నింపేలా పాలన

కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



2025 నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా నియోజక వర్గం లోని ప్రజలు జీవితాల్లో కొత్త వెలుగులు నిండేలా పాలన సాగిస్తాం. ముఖ్యంగా ఏనుగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేస్తాం. గిరిజన ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం కల్పించి మెరుగైన విద్య, వైద్య సేవలు, తాగునీరందించే దశగా కృషి చేస్తాను. గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధిలోకి తీసుకొస్తా.

కొత్త ఏడాదిలో మెయిన్ రోడ్డు విస్తరణే లక్ష్యం

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



కొత్త సంవత్సరంలో పాలకొండ మెయిన్ రోడ్డు విస్తరణ ధ్యేయం. పట్టణ సుందరీకరణే లక్ష్యంగా పని చేస్తా. నగరపంచాయతీగా ఏర్పాటైనప్పటికీ పాలకొండ ఇప్పటికీ అస్తవ్యస్థంగా ఉంది. పట్టణ రూపురేఖలు మార్చాల్సిన అవసరం ఎంతో ఉంది. అన్నారు. డివిజన్ కేంద్రమైన పాలకొండ నగరపంచాయితీని సుందరీకరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. మెయిన్ రోడ్డు విస్తరణ చేపట్టి రోడ్డు మధ్యలో సెంటర్ లైటింగ్‌తో సుందరీకరిస్తాం.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల

- ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
- పురుషులు 12,948.. మహిళలు 8,607
- అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఓటర్లు
- 2019 కంటే 1968 మంది అధికం

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
విజయనగరం	3,100	1,837	4,937
శ్రీకాకుళం	3,275	1,554	4,929
పార్వతీపురంమన్యం	1,532	730	2,262
ఎఎస్ఆర్	891	557	1448
విశాఖపట్నం	2,403	2,874	5,277
అనకాపల్లి	1,747	1055	2,802
మొత్తం	12,948	8,607	21,555

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఆరు జిల్లాలో పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా, 8607 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937 మంది, పార్వతీపురం మన్యంలో 2262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587 మంది కాగా, ఈ సారి స్వల్పంగా పెరిగారు. వచ్చే మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబర్‌లో 30 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గతనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల తుదిజాబితాను విడుదల చేశారు. 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా, అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా, వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3325మంది, మహిళలు 2,962 మంది కాగా మొత్తం 6,287 మంది దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలా ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనుంది.

మంత్రి హామీతో సమ్మె విరమణ

మద్దతు పలికిన ప్రజాసంఘాలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక దివాకర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1659 మంది గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 45 రోజులుగా శాంతియుత మార్గం లో సమ్మె చేసినట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసిన సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమణ చేసినట్లు చెప్పారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు పెంచుతామని, అవుట్ సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మారుస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ఆమె మాటపై నమ్మకంతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె విరమిస్తున్నట్లు చెప్పారు. 43రోజుల పాటు తమ పోరాటానికి మద్దతు పలికిన అన్ని ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులకు ధన్యవాదాలని దివాకర్ చెప్పారు.

సీతంపేట : గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె విరమించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటిడిఎ ముఖద్వారం వద్ద గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, జెఎసి నాయకులు బి.ఉమామహేశ్వరరావు నిమ్మరసం ఇచ్చే సమ్మెను విరమించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారావు, గణేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం : మంత్రి

రూ:160 లక్షలతో తారు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - పాచిపెంట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు వేస్తానని ఇచ్చిన హామీని అమలు చేస్తుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పణుకువలస పంచాయతీ చెరుకుపల్లి నుంచి నుంచి పారమ్మ గుడి వరకు సుమారు రెండు కిలోమీటర్లు తారు రోడ్డు, అర కిలోమీటర్ సిసి రోడ్డును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చీపురువలసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఆగష్టులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశానన్నారు. ప్రతి మండలానికి సుమారు రూ.20కోట్లు మేరకు పనులు మంజూరు చేశామన్నారు. సాలూరు నియోజకవర్గంలో రూ.80కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టామన్నారు. కారడవలసలో నివసించే వారు ఆసుపత్రికి వెళ్లాలంటే 40 కిలోమీటర్లు వెళ్లాలని, వారి కోసం కంటైనర్ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని, చుట్టుపక్కల 13 గిరిజన గ్రామాల ప్రజలు అక్కడ వైద్యం చేయించుకుంటున్నారని వివరించారు. శంబర పోలమ్మ గుడి వరకు రోడ్డు వేయించామని, గవరపల్లి ముత్యాలమ్మకు గుడి కట్టించి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు, విద్యా, వైద్యం, రోడ్లపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎంపిడిఒ డివికె పాత్రో, గిరిజన అభివృద్ధి సంస్థ డిఇఇ బి.సంతోష్, ఎఇ బివివి సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాయే లక్ష్యం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

నూతన సంవత్సరంలో జిల్లాను రక్తహీనత నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గతేడాది చేపట్టిన కార్యక్రమాలను, 2025లో నూతన ప్రణాళికలను తెలియజేశారు. రక్తహీనత నియంత్రణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని, గర్భిణులను దత్తత తీసుకునేందుకు దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. స్థానికంగా లభించే ఆహారం, జీవనశైలి అలవాట్లను మార్చుకోవడం ద్వారా రక్తహీనతను నియంత్రించేందుకు అనుసరించాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గర్భిణుల్లో రక్తహీనతను నియంత్రించేందుకు స్వచ్ఛందంగా విరాళం ఇవ్వవచ్చని జిల్లాలో "బాలిక శిశు అభివద్ధి నిధి" (ఖాతా నం.069901000332, IFSC కోడ్: ICICI 0000701) ఏర్పాటు చేశామని వివరించారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరులో గర్భిణుల వసతి గృహంతో పాటు సీతంపేటలో కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా సాలూరు మండలం తోణం పిహెచ్‌సి కారడవలసలో కంటైనర్ ఆధారిత ఆసుపత్రులు (గిరి వైద్య ఆరోగ్య కేంద్రం) ప్రారంభించామని చెప్పారు. కురుపాం నియోజకవర్గంలో రెండు, పాలకొండ నియోజకవర్గంలోని భామిని మండలంలో ఒకటి రాబోయే వారంలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. జిల్లాలో మలేరియా నివారణకు డ్రోన్ల ద్వారా ఐఆర్ఎస్ పిచికారీ చేయడంతో పాటు గతేడాది లక్ష గంబూషియా చేపల పెంపకం చేపట్టగా ఈ ఏడాది పది లక్షల చేపలు పెంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని తెలిపారు. హాస్టళ్లలో అనారోగ్య కారణాల కేసులు నమోదయ్యాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుల కోసం సుమారు రూ.189 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. 31.72 కిలోమీటర్ల మేర రూ.29.61 కోట్లతో 19 రోడ్లు వేస్తున్నామని, ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.211 కోట్లతో దాదాపు 472 పనులు మంజూరయ్యాయని, వీటిలో ఇప్పటికే రూ.102 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.23 కోట్లతో గుంతల లేని రోడ్లు చేసేందుకు పనులు జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి ముగుస్తుందని చెప్పారు. స్వచ్ఛ గ్రామంగా ఉండేందుకు స్వచ్ఛంధంగా గ్రామ వాలంటీర్లు ముందుకు వచ్చి చెత్తను సేకరించేందుకు గ్రామం నుంచే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. బహిరంగ మలవిసర్జన రహిత సమాజం, స్వచ్ఛ గ్రామాలను స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా ఆవిష్కృతం చేస్తున్నట్లు వివరించారు. డయల్ యువర్ ఆఫీసర్ ప్రోగ్రామ్‌లను సామాన్యులకు చేరవేయడంతో పాటు, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జీవనోపాధి కార్యక్రమాల కింద జీడిపప్పు, పసుపు, చింతపండు, కుట్టు తదితర రంగాల్లో 78 వన్ ధన్ వికాస్ కేంద్రాలను (వీడీవీకే) బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. దాదాపు 713 రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని, 4,660 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో జాబ్ మేళాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, స్వర్ణాంధ్ర ఏ2047 కింద పాలు, మాంసం, నిమ్మగడ్డి తదితర అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

వాటర్ గ్రిడ్

జిల్లాలోని 1987 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.1432 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మాణ ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు. వచ్చే వేసవిలో కొన్ని చోట్ల తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం నీటిని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

పీసా ఎన్నికలపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

పీసా ఎన్నికల నిర్వహణపై అధికారులకు, తహశీల్దార్లకు, ఎంపిడిఒలకు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ శిక్షణ నిర్వహించారు. మంగళవారం స్థానిక గిరిమిత్ర భవనంలో 8 మండలాలకు చెందిన 78 గ్రామ పంచాయితీల్లోని 278 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఎన్నికలు నిర్వహించాలని పిఒ ఈ శిక్షణలో తెలిపారు. కురుపాంలో 128, గుమ్మలక్ష్మీపురంలో 71, కొమరాడలో 20, జియ్యమ్మవలసలో 6, పాచిపెంటలో 36, సాలూరులో 15, మక్కువలో 1, మెంటాడలో 1 ఎన్నికల ప్రొఫార్మాలను ఎంపిడిఒలకు అందజేశారు. పీసా ఎన్నికలను జనవరి 2 నుంచి 6 వరకు నిర్వహించాలని పిఒ ఈ సందర్భంగా ఆదేశాలు జారీచేశారు.

ఎస్‌సి కులగణనపై 7 వరకు అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

షెడ్యూల్ కులం (ఎస్‌సి) కులగణన ఆడిట్‌పై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఒపి)ను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎండి గయాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఆన్లైన్ ప్రక్రియలో జనవరి 11 వరకు నమోదు చేస్తామన్నారు. అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 17న గ్రామ, వార్డు సచివాలయం వద్ద విడుదల చేస్తామని గయాజుద్దీన్ పేర్కొన్నారు.

పరిష్కారంపై హామీ ఇవ్వాలి : సిఐటియు

కౌన్సిల్ సమావేశానికి వెళ్లకుండా చైర్‌పర్సన్, కమిషనర్‌ను అడ్డుకున్నచిరు వ్యాపారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పోలీసులు గత రెండు నెలలుగా ప్రధాన రహదారిపై వ్యాపారాలు చేయకూడదని చేస్తున్న నిర్బంధానికి వ్యతిరేకంగా మంగళవారం చిల్లర వర్తకులు, తోపుడుబండ్ల వర్తకులు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వెళ్తున్న చైర్పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజుతో పాటు, కౌన్సిలర్లను సుమారు మూడు గంటల పాటు అడ్డగించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణు, వి.ఇందిర, బివి రమణ, బి.సూరిబాబు మాట్లాడారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గత రెండు నెలలుగా చిల్లర వర్తకులపై దౌర్జన్యం చేస్తున్నారని, వ్యాపారాలు చేయనీయడంలేదని అన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే, ఎస్పీ, ఎఎస్‌పి, మున్సిపల్ కమిషనర్ తదితరులకు అనేక దఫాలుగా తెలియజేసినా ఎలాంటి స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో సుమారు 200 మంది తోపుడుబండ్లపై చిల్లర వర్తకం చేసుకుని జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారిపై దౌర్జన్యాలకు పాల్పడడం ఎంతవరకు సమంజసంమని ప్రశ్నించారు. ఆందోళన విషయం తెలుసుకున్న పట్టణ సిఐ మురళీధర్, ఎస్సై గోవిందరావు, పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్య తీవ్రతను తెలియజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. దీంతో కార్మికులు తమ ఆందోళన విరమించారు. కార్మికుల ఆందోళనకు వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు సుధీర్ మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంచాన ఉమామహేశ్వరరావు, పాకల సన్యాసిరావు, చిల్లర వర్తకుల సంఘం నాయకులు అప్పలరాజు, సుధాకర్, వెంకన్న, రాజు, రోహిణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్, కౌన్సిలర్లను సమావేశ మందిరంలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్న తోపడుబండ్లు, చిల్లర వ్యాపారులు



పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్ట్స్ ఎన్‌జిఒ ద్వారా ఢిల్లీ నుంచి వచ్చిన విద్యార్థులతో మంగళవారం పిఒ ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ఏ విధంగా ప్రయత్నించాలి, ఎటువంటి ప్రణాళికలు వేసుకోవాలి వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే తాను సివిల్స్‌లో విజయం సాధించడానికి దోహదం చేసే అంశాలు, ప్రణాళికలు వంటి విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకునేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్న బాబు, ఎఒ సునీల్, డిడి అన్నదొర, ఆర్ట్స్ ఎన్జీవో డైరెక్టర్ నూక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పత్తి కొనుగోలు వేగవంతం చేయాలి

త్వరగా పత్తి రైతుల నుంచి పత్తి కొనుగోలు వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ యస్వంత్ కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక ఎఎంసి గోడౌన్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. పత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించి, పత్తి మద్దతు ధర రైతులు పొందేలా చూడాలని, ప్రతి రోజు ప్రత్తి కొనుగోలు ప్రక్రియ జరగాలని సూచించారు. కార్యక్రమంలో కాటన్ బయర్ అగర్వాల్, ఎఎంసి సెక్రటరీ సతీష్ కుమార్, తహశీల్దార్ అప్పారావు, వ్యవసాయధికారి కె. సింహాచలం ఉన్నారు.




కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గౌరీశ్వరి

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరగాల్సిన కౌన్సిల్ సమావేశం తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు సిఐటియు ఆధ్వర్యంలో జరిపిన నిరసన, ఆందోళనల మధ్య రెండు గంటల ఆలస్యంగా జరిగింది. మున్సిపల్ ఉద్యోగి అజెండాలోని పొందుపర్చిన 22 అంశాలను చదివి వినిపిస్తుండగానే కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, టిపిఒ ప్రమీలరాణి, మేనేజర్ లక్ష్మి, రెవిన్యూ అధికారి రూబెన్‌బిల్లు, ఆర్‌ఐలు, ప్రజారోగ్య విభాగం అధికారి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసన్నకుమార్

రంగంపేటలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రంగంపేటలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ క్రయ విక్రయ వంటి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, విఆర్ఓ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

నిడగల్లు సచివాలయాన్ని సందర్శించిన ఇఒపిఆర్‌డి

మండలంలోని నిడగల్లు గ్రామ సచివాలయాన్ని ఇఒపిఆర్‌డి కె.కుమార్‌వర్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్నకుమార్

ప్రణాళికా బద్ధంగా చదివితే విజయం మీదే..

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే విజయం తప్పనిసరిగా వరిస్తుందని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ కె రవి ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ఈ మూడు నెలలు కష్టపడి చదవాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎంసి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ, పాలక అమల, ఉపాధ్యాయులు పద్మశ్రీ, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సిపిఎం నాయకులు

పాఠశాలను తెరిపించాలని నిరసన

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని నార్ల వలస పంచాయతీ బొడ్డపాడులో ఎన్నో ఏళ్ళ గా గ్రామస్తులు, విద్యార్థుల పోరాటం ఫలితంగా ఇక్కడ పాఠశాలను ప్రారంభించారని కానీ అది నేటికీ తెరుచుకోపోవడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బొడ్డపాడులో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సుదూరానున్న నార్లవలస వరకు నడుచుకుంటూ పిల్లలు వెళ్ళాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో వీరి పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. దీంతో గ్రామస్తులు చాలా సార్లు ఉన్నతాధికారులకు పాఠశాల కోసం వినతి పత్రాలు అందజేశారని ఎట్టకేలకు కొన్ని నెలలు కిందట ఇక్కడ పాఠశాల మంజూరు చేస్తున్నట్లు అధికారులు తెలిపారన్నారు. అయితే నేటికీ ఇక్కడ తరగతులు ప్రారంభించలేదని, దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నట్టు తెలిపారు. కలిసి నిరసనలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లిసు లక్ష్మణ,ప్రిన్సిస్,బుదరయ్య,రత్నాలమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని గుమ్మలో సైబర్ క్రైమ్ నేరాలు, రహదారి ప్రమాదాలు మత్తు పదార్థాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్చి ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి మనిషి జాగ్రత్తగా ఉండాలని, కొత్త కొత్త నెంబర్ నుంచి ఫోన్ చేసి రుణాలిప్పిస్తామని, లాటరీ పేలిందని అనేక రకాలు ప్రలోభాలు పెడుతుంటారని, మోసపోవద్దని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ మద్యపానం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్, ఎస్పీ ఎస్వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి విధిగా శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అటవీ ప్రాంతం గుండా జరిగే రవాణాకు అటవీ శాఖ అడ్డుకట్ట వేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల చెడు ప్రభావాలను వివరించాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాల పంటలు పండించే వారికి ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రూపు మాపడమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. వీటిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని, ఈ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 49 మందిని అదుపులోకి తీసుకున్నామని, 9 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని ప్రజలు అందించుటకు ప్రత్యేకంగా ఫోన్ నంబరును ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బాధితులకు త్వరగా నష్టపరిహారం చెల్లించాలి

జిల్లాలోని ఎస్సి, ఎస్టిలపై జరిగిన దాడుల కేసుల్లో బాధితులకు త్వరగా నష్ట పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్సి, ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎస్పీతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రతి కేసును పరిశీలించి వివరాలు అడిగారు. కేసుల విచారణ పక్కాగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పి మాధవరెడ్డి

చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బాధితులకు త్వరగా పరిహారం అందాలని, దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. కేసుల్లో వాస్తవాలు తెలుసుకొని కేసులు పెట్టాలని, తప్పుడు కేసులు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పి మాధవరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు నమోదైన కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందుకు సంబంధిత శాఖల సహకారం కూడా తీసుకుంటున్నామని అన్నారు.

పిసి, పిఎన్‌డిటి చట్టాన్ని పక్కాగా అమలుచేయాలి

జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ (పీసీ, పిఎన్‌డిటి)చట్టాన్ని పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సమాజంలో మగ, ఆడ శిశు నిష్పత్తి సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ఎవరూ వెళ్లవద్దని ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఆయన కోరారు. ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా అబార్షన్లు చేసే ఆర్.ఎం.పి. డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలి

ద్విచక్ర వాహనాలు నడిపే వారికి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని కలెక్టర్ తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం, అతివేగం వలన జరిగే ప్రమాదాల గురించి అందరికీ తెలిసేలా, కనబడేలా పోస్టర్లను అతికించాలని, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకర రహదారులు, మలుపుల వద్ద ముందుగా గుర్తించే ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిగ్నల్ లైట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పి మాట్లాడుతూ ఇప్పటికే హెల్మెట్ ధారణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుమును విధిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు పోలీస్ యంత్రాంగం తరపున అన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

సమావేశంలో ఎఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, సురాన అంకిత్ మహావీర్, కెఆర్‌ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డి.రామచంద్ర రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయపార్వతి, నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా డ్రగ్స్ నియంత్రణ అధికారి ఎ.ఆశా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, వీరేష్‌చంద్రదేవ్

పేదలకు కూటమి ప్రభుత్వం భరోసా : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పేదలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. పట్టణంలోని 19,20వార్డుల్లో చేపట్టిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా ఒక రోజు ముందే పింఛన్లు పంపిణి చేస్తుంటే వృద్దులు,పేదల కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, టిడిపి యువతనేతలు హర్ష, కౌన్సిలర్ వైదేహి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని గుమ్మలో జరిగినటువంటి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ, కిమిడి చంటి, ఆరిక సాయి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కాంత్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని విక్రమపురంలో అరుకు పార్లమెంట్ రైతు కమిటీ అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. నాగూరులో ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోట గౌరి పలు పంచాయతీ సర్పంచులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో 93శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బి వెంకటరమణ తెలిపారు. మండలంలోని 9706 పింఛన్ దారులు ఉన్నట్లు తెలిపారు.

పద్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

దేశంలో ఎన్నో భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ తెలుగువారికే సొంతమైన పద్యాన్ని సంరక్షించుకోవాలని తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక లయిన్స్ క్లబ్‌లో ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 12గంటల ఏకధాటి పౌరాణిక పద్య, ఏకపాత్రాభినయం ఉత్తరాంధ్రాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మారుతున్న పరిస్థితుల కారణంగా తెలుగు పద్యం ప్రభావాన్ని కోల్పోతుందని, కేవలం పౌరాణిక నాటక కళాకారులే దీన్ని సంరక్షిస్తున్నారని, కనుక వారిని ప్రభుత్వంతో పాటు ప్రజలు ప్రోత్సహించి ఆదరణ చూపించి పద్యాన్ని రక్షించుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో గల కళాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం నాటక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అధ్యక్షులు బడి శ్రీరాములు, కళాకారులు అమరాపు రామకృష్ణ, పివి శాస్త్రి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు బి.సీతారాం, బోను చంద్రమౌళి, పెంట సత్యనారాయణ, పలువురు ఉత్తరాంధ్ర కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల మధ్య మంత్రి నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -సాలూరు రూరల్

మండలంలో కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి విద్యార్థినులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కొత్తకొత్త ఆలోచనలతో భవిష్యత్తును ఉన్నత మార్గంలో ముందుకు వెళ్లడానికి, దాని ద్వారా తల్లిదండ్రులకు, సమాజానికి మేలు చేసేలా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అవసరం

ప్రజాశక్తి - సీతానగరం

వైద్య సేవలందించే క్రమంలో అంకితభావం, సేవాదృక్పథం అలవర్చుకోవాలని, పని తీరే ప్రామాణికమని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, అందజేస్తున్న చికిత్సా వివరాలు పరిశీలించారు. ప్రధాన రహదారికి సమీపాన పిహెచ్‌సి ఉన్నందున అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లు, మందులు, వైద్య పరికరాల లభ్యత పరిశీలించారు. అక్కడ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో డాక్టర్ జగన్మోహన్ పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ముందస్తు ప్రణాళికతో ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, తద్వారా సత్ఫలితాలుంటాయని, శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు అందుబాటులో ఉన్న అన్ని ఉచిత వైద్య సదుపాయాలు తెలియజేయాలని అన్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఫలితంగా వారికి ప్రయాస తగ్గుతుందని అన్నారు. గ్రామాల వారీగా ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు పరిశీలించి పురోగతికి కృషి చేయాలన్నారు. అనారోగ్య సమస్యలతో గుర్తించిన వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జగన్మోహన్‌రావు

పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత, మాతా, శిశు ఆరోగ్యం, కిశోర బాలికలు, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా అందజేస్తున్న వైద్య సేవల విషయంలో అంకితభావం, సేవా దృక్పథం అలవర్చుకోవాలని, తద్వారా వృత్తిలో ఎంతో సంతృప్తి ఉంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. పావని, ఎపిడిమిక్ ఇఒ సత్తిబాబు, పంచాయతీ సెక్రటరీ ఇ.రమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి మళ్లీ బ్రేక్

ఆమోదించని కౌన్సిలర్లు
మున్సిపల్ బడ్జెట్ ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ ప్రజారోగ్య శాఖలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి మళ్లీ బ్రేక్ పడింది. గత సమావేశాల్లోనూ ఇదే అంశాన్ని కౌన్సిలర్లు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. మంగళవారం చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ, బడ్జెట్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఉద్యోగాల భర్తీ అంశాన్ని మరోసారి వాయిదా వేశారు. ఈ అంశాన్ని ఆమోదించాలని చైర్‌పర్సన్ కోరినా కౌన్సిలర్లు అంగీకరించలేదు. ప్రజారోగ్య విభాగంలో ట్రాక్టర్, జెసిబి, కాంపాక్టర్, సెప్టిక్ క్లీనర్ల నిర్వహణకు ఐదుగురు డ్రైవర్లు, ఇద్దరు క్లీనర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రతిపాదించారు. అయితే గత కొంతకాలంగా ఈ అంశంపై కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా వేస్తున్నారు. పట్టణంలో 34 సామాజిక మరుగుదొడ్ల ఏడాది నిర్వహణకు సంబంధించి పిలిచిన టెండర్లపై వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వకుండా టెండర్లు ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. దీనికి కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ మద్దతు పలికారు. కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు మాట్లాడుతూ దళితులైన పారిశుధ్య కార్మికులకు 8నెలలుగా జీతాలివ్వకపోతే ఎలా బతుకుతారని నిలదీశారు. ముందు కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 2024-25 సవరించిన బడ్జెట్, 2025-26 అంచనాల బడ్జెట్‌ను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు నీలిమ, జి.నాగేశ్వరరావు, టి.లక్ష్మోజీ, వి.హర్షవర్ధన్, కొనిసి వరలక్ష్మి, బి.సీతమ్మ, డి.విశాలాక్షి, కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ శివప్రసాద్,డిఇ ప్రసాద్ పాల్గొన్నారు.



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్లు

అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -భామిని

మండలంలోని వివిధ శాఖల్లో ప్రాధాన్యతతో కూడిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోత్సాహకం సక్రమంగా వినియోగించి, మండలం అభివృద్ధి చెందాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల నీతి అయోగ్ వెల్లడించిన ర్యాంకుల్లో దక్షిణ భారతదేశంలోనే భామిని మండలం ప్రథమ స్థానంలో నిలవడం చాలా గొప్ప విషయమన్నారు. కావున ఇదే విధంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. మండలంలో విద్య, వైద్యం తాగునీరు, రోడ్లు వంటి రంగాల్లో ప్రధానంగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోని ఇంతవరకు రోడ్డు సదుపాయం లేని గ్రామాలకు రోడ్లు, తాగునీరు అందేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన సుగర్, డయాబెటీస్ వంటి నివారణకు, ఎనీమియా నివారణకు ఇన్నోవేటివ్‌గా అలోచించి ఏదైనా కార్యక్రమం చేపట్టలే ప్రతిపాదన పంపించాలని, పాఠశాలలో మాథ్స్, సైన్స్ అంశాల్లో పిల్లలకు సులువుగా వచ్చేలా ఒక కార్యక్రమంతో ప్రతిపాదన పంపాలని, వివిధ రంగాలు అభివృద్ధికి సృజనత్మక అంశాలపై దృష్టి సారించి ప్రతిపాదనలు పంపితే సులువుగా అప్రూవ్ అవుతాయని పిఒ తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, ఇతర మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

నిరంకుశ విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఎపిఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక బస్ డిపో వద్ద భోజన విరామ సమయంలో గేట్ మీటింగు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను పక్కన పెట్టి కొంతమంది ఆర్టీసీ అధికారులు అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని, ఈ సస్పెండ్ల వల్ల ఉద్యోగస్తుల్లో మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. సిబ్బంది అనారోగ్యంతో సెలవు పెడితే జీతాలు కోత విధిస్తున్నారని, చిన్న పొరపాటు జరిగితే దానికి చార్జిషీట్ ఇచ్చి విపరీతమైన పనిష్మెంట్లు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటిపైన గత నెల 29న విజయవాడలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వద్ద చర్చలు జరిగాయన్నారు. ఈ సమావేశంలో కింద స్థాయిలో పూర్తిగా 1/ 2019 సర్క్యులర్‌ను అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకుండా సస్పెండ్లు చేయడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని మూర్తి అన్నారు. ఈ సందర్భంగా జనవరి 3, 4 తేదీల్లో అన్ని డిపోల వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తూ అవసరమైతే జనవరి 10 నుంచి సామూహిక సెలవు పెట్టి వెళ్లిపోతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గారావు, డిపో ప్రెసిడెంట్ ఎంవి సాగర్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వెంకట రమణ, డిపో సెక్రటరీ ఎల్.దామోదర్ నాయుడు, గ్యారేజీ ప్రెసిడెంట్ పి.లక్ష్మణరావు, సిసిఎస్ డెలిగేటు జి.విజయ బాబు, రాష్ట్ర కమిటీ నెంబరు డిఎస్‌వి రాజు, నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

మెగా టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జనవరి ప్రారంభమయ్యే క్రికెట్ మెగా టోర్నీ పాలకొండ క్రికెట్ లీగ్ (పిసిఎల్) పోస్టర్‌ను స్థానిక నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు నూతన చైర్మన్‌ను సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రారంభంలో పాలకొండలో ఈ మెగా టోర్నీ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ పిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ పాలకొండకు మరింత వన్నె తీసుకొస్తుందని, మండల స్థాయిలో నిర్వహించే ఈ లీగ్‌లో రూ.50వేలు నగదు బహుమతి ఉందన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీయడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కౌన్సిలర్ వెలమల మన్మధరావు, ఉద్యోగ సంఘాల నేత ఎస్.భరత్ భూషణ్‌రాజ్, ఆకుల కుమార్, బాసురు కాంతారావు, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, దుంపల చిన్ని, విసు, టోర్నీ నిర్వాహకులు ముఖేష్, యువ క్రికెటర్లు పాల్గొన్నారు.